# మారుతి ఉత్తరం

ఆకెళ్ల పద్మావతి

**"ఏవండీ! అబ్బాయి నుండి ఉత్తరం వచ్చిందా? ఈ రోజు వచ్చే ఉంటుంది. నాకు కలొచ్చింది. పైగా తెల్లవారు ఝామున కూడానూ! ఏమిటి? ఉలుకూ పలుకూ లేక అలా ఉండిపోయారు" రామనాథం చేతిలోని సంచి, కర్ర అందుకుని మంచినీళ్లు అందించింది పార్వతి.**



**"హూఁ,** నీకు ఇప్పటికి ఎన్ని సార్లు రాలేదే వాడి మీద కల? ఆ కలలేవో కనీసం వాడికి నీ మీద వస్తే అప్పుడైనా ఒక ఉత్తరం ముక్క రాసేవాడేమో" పట్టిన చెమటని తుడుచుకుంటూ పడక కుర్చీలో జార్లపడ్డాడు రామనాథం.

కంటిలోని నీటిపొర ఆయనకి కనిపించకుండా కళ్లు ఒత్తుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయింది పార్వతి.

* * *

"పార్వతీ! ఎలా ఉంది? ఈ రోజైనా కాస్త అన్నం తినేలా ఉందా?"

"ఊఁ ఫర్వాలేదు. కాస్త చారు అన్నం తింటాను. నాలుగు రోజుల నుండి మీరు తంటాలు పడుతూంటే చూడలేకుండా ఉన్నాను. లేవలేకండా ఉన్నాను. నాలుగు మెతుకులు తింటే కాస్త ఓపిక వచ్చి ఎలాగో కాలక్షేపం చేస్తాను."

"అందుకే నీకు బలానికి మంచి మందు తెచ్చాను'

"ఏదీ?"

"ఇదిగో" జేబులోనుండి ఉత్తరం తీసి చూపించాడు.

"హమ్మయ్య! అబ్బాయి నుండి ఉత్తరం వచ్చేసిందా? ఇక నాకు ఓపిక వచ్చేసినట్లే. ఇంతకీ ఏం రాసేడు?"

"ఉండు, చదవనీ"

"పూజ్యులైన నాన్నగార్కి, అమ్మకు నమస్కారములు. ఉభయ కుశలోపరి. ఇదివరలో నేను రాసిన ఉత్తరాలు అందాయనుకుంటాను. కాని మీ నుండి లెటర్స్ రావడం లేదు. ఎందుచేత? మీరిద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు తలుస్తాను. సంక్రాంతికి ఇంటికి రావడానికి ప్రయత్ని స్తున్నాము. మీ కోడలు, మనవలు మిమ్మల్ని చూడాలని గొడవ చేస్తున్నారు. అమ్మా! ఇందులో రూ.1000 డి.డి. పంపుతున్నాను. నీవు, నాన్నగారు కొత్తబట్టలు తీసుకోండి. మీ లెటర్‌కై ఎదురు చూస్తూ ఉంటాను.

మీ అబ్బాయి శశిధర్.

"చూశారా! నేను అనుకున్నట్లే అయింది. పిచ్చితండ్రి ఎలా ఉన్నాడో ఏమిటో? మీరేమో వాడు ఉత్తరం రాయలేదని కోపం వచ్చి మీరు కూడా రాయడం మానేశారు. మనవలు పెద్దాళ్లయి పోయి ఉంటారు. పండక్కి పది రోజులు ఉండేట్టుగా సెలవు పెట్టి రమ్మనమని రాయండి"

"పార్వతీ! నాలుగు లంకణాల నీరసం ఎక్కడికి వెళ్లిపోయిందే! అబ్బో! అంత హుషారు!"

"మీకు అలాగే అనిపిస్తుంది. లేక లేక భగవంతుడు ఇచ్చిన వరం వాడు. నా కలల పంట"

"అహా! నీకే కొడుకు, మరి నాకేమిటో?!"

"అయినా కన్నది నేనూ!"

"అవును పాపం, ఇంతకీ పట్టు చీర ఎప్పుడు కొనుక్కుంటావ్?"

"సరేలెండి, నాకు ఇంకా పట్టు చీరలు మోసే ఓపిక ఏది? కోడలికి పిల్లలకి దానితో ఏదైనా మంచి వస్తువు కొనిద్దాం సరేనా?"

"అలాగే నీ ఇష్టమే నా ఇష్టం"

'అస్సలు నిద్ర రావడం లేదు. కళ్లు పూర్తిగా పొడారి




"దుర్వార్తా శ్రవణం అని వారఫలాల్లో ఉంటే ఏమిటో అనుకున్నాను"

"ఏం జరిగింది?"

"పండక్కి అల్లుడు వస్తున్నాడు ఉత్తరం వచ్చింది."

**- పి. సరోజ** (అమలాపురం)

పోయాయి. పక్కన పార్వతి ప్రశాంతంగా నిద్ర పోతోంది. తాను కోరుకున్నది ఇదే. తను చేస్తున్న పనిలో న్యాయం ఉందనిపించింది. పార్వతి తన ప్రాణంలో ప్రాణం. కాపురానికి వచ్చింది లగాయితు తనతో ఎన్ని ఒడుదుడుకులు తట్టుకుంది. ఏనాడు తన మనసుని నొప్పించి ఎరగదే. పెళ్లైన ఆరు సంవత్సరాలు అయిన పిల్లలు కలగలేదని ఎంత బాధ పడింది. మగవాడు కాబట్టి సూటీ పోటీ మాటలు తనదాక రాలేదు, కాని అటు, ఇటు పార్వతి అందరి చేతా ఎన్నో మాటలు అనిపించుకుంది పాపం-' ఎందుకో గుండె దగ్గర బరువుగా అనిపించింది. నెమ్మదిగా లేచి గ్లాసుడు మంచినీళ్లు తాగాడు రామనాథం. ప్ఫ్! అబ్బాయి అడ్రస్ ఎలా తెలుసుకోవడమో అర్థం అవడం లేదు. అంత బొంబాయి నగరంలోకి తాను వెళ్లగలడా? ఊహూఁ. ఎన్ని ఉత్తరాలు రాసినా అన్నీ రీడైరెక్ట్ అయి వచ్చేస్తున్నాయి. పోనీ ఇల్లు మారాడా! మరి ఆఫీస్ అడ్రస్‌కి కూడా రాసాను కదా! వాటికి రిప్లై రాలేదు. ఎలా? మనసుకి ఏదీ తోచకుండా ఉంది.

ప్ఫ్. భగవంతుడా! వాడు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటే అంతే చాలు. నాలుగయిదు నెలలకు పైగా అయిపోయింది వాడి నుండి ఉత్తరం వచ్చి. తాను నిరుత్సాహ పడితే పార్వతి అసలు తట్టుకోలేదు. ఆమె ఆరోగ్యంగా తిరగాలంటే చివరికి వాడు రాసినట్లుగా తానే రాసి పార్వతిని నమ్మించడం అయింది. ఊళ్లో ఉన్న పొలం అమ్మితేగాని గడవని పరిస్థితి కూడా ఏర్పడి పోయింది. క్షణకాలం కళ్లు చెమర్చాయి రామనాథానికి.

* * *

'ఇదేదో ఫారిన్ నుండి వచ్చినట్లుందే, మనకి అక్కడి నుండి రాసేదెవరు చెప్మా!' అనుకుంటూ చదవడం ప్రారంభించాడు రామనాథం.

'నాన్నగార్కి అమ్మకు నమస్కారములులు. ఈ మధ్య అనుకోకుండా ఫారిన్ వెళ్లే అవకాశం వచ్చింది. కనీసం మీకు తెలియచేసి వెళ్లే అవకాశం లేకపోయింది. తెలిపినా మీ నుండి అంగీకారం రాదని తెలుసు. ఇక్కడకు వచ్చి సెటిల్ అయ్యాక రాద్దామని లెటర్ రాయలేక పోయాను. విపరీతమైన ఖర్చులు అవడంతో పంపాల్సిన డబ్బు పంపలేక పోయాను. ఈ నెల కూడ కాస్త సర్దుకుంటే వచ్చే నెలకి పంపగలుగుతాను. తిరిగి మేము అక్కడికి రావడానికి నాలుగు సంవత్సరాలు పట్టవచ్చు. ఈ క్రింది అడ్రస్‌కి లెటర్స్ రాస్తూ ఉండండి.

ఇట్లు మీ అబ్బాయి - శశి.

గుండె గుభేల్‌మని పోయింది రామనాథానికి.

ఇప్పటికి ఈ పల్లెటూళ్లో మమ్మల్ని వదిలి చాల దూరం జరిగాడనుకున్నాను. ఇప్పుడు ఇంకా దూరం పోయాడన్న మాట. ఎంత సింపుల్‌గా రాసేశాడు. వాడ్ని చూడాలని తనకే ఎంతో బెంగగా ఉందే, నాలుగు నెలల్లో సంక్రాంతి ఉందని ఇప్పటి నుండే కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్న పార్వతిని నాలుగు సంవత్సరాలు ఎలా? ఎలా...? గుండె పిండినట్లయింది రామనాథానికి.

"నా శశిని ఏదో పెద్ద చదువులు, ఉద్యోగాలు అంటూ ఎక్కడికో పంపించేస్తే నేను ఊరుకోను. బాగా చదువుకుని ఇక్కడే మంచి ఉద్యోగం చేసుకుంటాడు నా తండ్రి. చంటితనంలో వాడ్ని ఒళ్లో పడుకోపెట్టుకుని పార్వతి అన్న మాటలు మారుమ్రోగుతున్నాయి. నిజమే వాడి చదువుకి ఇక్కడ మాత్రం సరైన జీవితం లేదా? కనీసం ఈ దేశంలో కూడా! పెదవి విరుపు, నిట్టూర్పు ఒక సారే వచ్చాయి రామనాథానికి. ప్ఫ్! ఏం చేస్తాం? పరిధి అన్నది దేనికుంది? ఎక్కడ ఉంది? ఏమో! కాని తన పరిస్థితి ఏమిటి? ఏముంది? మారుటి ఉత్తరం తయారు చెయ్యడమే.

